సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం। 4। అక్టోబర్। 2025



వైభవంగా శమీవృక్ష పూజ
ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామికి గురువారం విజయదశమి సందర్భంగా ఆలయ అర్చకులచే టీటీడీ అధికారులు వైభవంగా శమీ వృక్ష పూజ నిర్వహించారు. -10లో



దెబ్బతిన్న లోలెవల్ కాజ్‌వే వంతెన
సిద్దవటంలోని పెన్నా నదిపై నిర్మించిన లోలెవల్ వంతెన గత కొంత కాలంగా ప్రవహిస్తున్న వరద నీటి కారణంగా దెబ్బతింది. గురువారం ఒక్కసారిగా కుంగిపోయింది. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.210
రెండోరకం	రూ.110	రూ.160

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 116 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

7న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం
కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు జెడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సీఈఓ ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన జెడ్పీటీసీలంతా ఉదయం 10 గంటలకు స్థాయీ సంఘ సమావేశాలకు హాజరు కావాలని కోరారు.

రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా మేడా రఘునాథరెడ్డి



రాజంపేట: భారతీయ రైల్వే కమిటీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి నియమితులయ్యారు. రైల్వేస్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా సీఎం రమేష్ నియమితులయ్యారు. ఈయనతోపాటు కమిటిలో సభ్యులుగా లోక్‌సభ నుంచి 21 మంది లోక్‌సభ సభ్యులను తీసుకున్నారు. అలాగే రాజ్యసభ నుంచి పది మంది సభ్యులను రైల్వే స్టాండింగ్ కమిటిలోకి తీసుకున్నారు. ఇందులో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి కూడా ఒకరు కావడం విశేషం. రైల్వేస్టాండింగ్ కమిటి సభ్యునిగా మేడా రఘునాథరెడ్డి ఎంపిక కావడం పట్ల పలువురు వైఎస్సార్‌సీపీనేతలు, అభిమానులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. రైల్వేశాఖ పరంగా ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని రైల్వే స్టాండింగ్‌కమిటీ సభ్యుడు, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి అన్నారు.

విద్యాబోధన పటిష్టం చేయడానికే శిక్షణ



మాట్లాడుతున్న ఆర్‌జేడీ శ్యాముల్, పక్కన డీఈఓ సుబ్రమణ్యం

రాయచోటి: డీఎస్సీ–2025లో ఎంపికైన కొత్త ఉపాధ్యాయుల విద్యాబోధన పటిష్టం చేయడం కోసమే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆర్‌జేడీ శ్యామ్యుల్ అన్నారు. శుక్రవారం రాయచోటిలోని అర్చన కళాశాలలో జరిగిన ఇండక్షన్ రెసిడెన్షియల్ శిక్షణను డీఈఓ సుబ్రమణ్యంతో కలిసి ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు విద్యావృత్తిని సమర్థవంతంగా ప్రారంభించాలన్నారు.డీఈఓ మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి 10వ తేదీ వరకు జిల్లాలోని ఐదు కేంద్రాల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఇందుకోసం రాయచోటిలో రెండు, మదనపల్లిలో మూడు సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు.రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి భానుమూర్తి రాజు, స్టేట్ నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. మొదటిరోజు 273 మంది ఉపాధ్యాయులకు 269 మంది హాజరైనట్లు డీఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిపి రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, ఏఎంఓ అసదుల్లా, విద్యాశాఖ సిబ్బంది, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ప్రాణాలతో చెలగాటం!

- ములకలచెరువులో ఎక్సైజ్, పోలీసు సర్కిల్ స్టేషన్లకు కిలోమీటర్ దూరంలోనే నకిలీమద్యం కర్మాగారం
- పోలీసు నిఘా విభాగం నిర్లక్ష్యం
- నకిలీమద్యం తయారీలో టీడీపీ నేతలపై సోషల్ మీడియాలో ప్రచారం





నకిలీమద్యం తయారీ కేంద్రం వద్ద నిలిచిన ఎక్సైజ్ అధికారుల వాహనాలు



బాటిళ్లలో మద్యం నింపే యంత్రం

మదనపల్లె: మద్యం అక్రమ కేసులతో వైఎస్సార్‌సీపీ నేతలపై కక్షకట్టి వేధిస్తున్న కూటమి ప్రభుత్వం తన పాలనలో ఏకంగా నకిలీ మద్యం తయారీ కార్మాగారమే వెలసింది. రూ.కోట్లు ఆర్జించాలన్న లక్ష్యంతో అన్నమయ్య జిల్లా మండల కేంద్రం ములకలచెరువుకు కూతవేటు దూరంలో నకిలీమద్యం తయారీ కార్మాగారం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. స్పిరిట్‌తో తయారు చేసిన ప్రాణాంతక నకిలీమద్యం వ్యవహారంలో అధికార పార్టీనేతల ప్రమేయంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మారుమూల తంబళ్లపల్లె నియోజకవర్గానికి పరిశ్రమలు తెస్తామని టీడీపీ నేతలు ఇచ్చిన హామీలు అమలు కాలేదు కాని నకిలీమద్యం ఫ్యాక్టరీ వచ్చిందంటూ సోషల్‌మీడియాలో ప్రచారం సాగుతోంది. స్పిరిట్‌తో తయారైన నకిలీమద్యం తాగితే ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నట్టే. చవక మద్యం తాగే వారిని లక్ష్యంగా చేసుకుని విక్రయిస్తున్న నకిలీ మద్యం వ్యవహారంపై కూటమిప్రభుత్వం తెరవెనుక ఎవరున్నారో తేల్చుతుందా లేక కాపాడుతుందా అనేది చూడాలని ప్రజలు అంటున్నారు.

దాడితో నకిలీమద్యం మాయం

ములకలచెరువులో నకిలీమద్యం తయారీ కార్మాగారంపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారన్న సమాచారంతో అక్కడినుంచి సరఫరా అయిన మద్యం బాటిళ్లను ఎక్కడికక్కడ దాచేశారు. బెల్టుషాపుల్లో విక్రయిస్తున్న మద్యం బాటిళ్లతోపాటే విక్రయాలను కూడా నిలిపివేశారు. దాడులు తమ వరకు జరుగుతాయన్న ఆందోళనతో బెల్టు నిర్వాహకులు నకిలీ మద్యం బ్రాండ్ల బాటిళ్లు దాచేసి మొబైల్‌ఫోన్లు స్విచ్చాఫ్ చేసేశారు. కాగా ఈ మద్యం తయారీపై సోషల్ మీడియాలో స్థానిక ముఖ్య టీడీపీ నేతలకు ప్రమేయం ఉందంటూ ఆరోపణలతో హోరెత్తిస్తున్నారు.

నిఘాకు చిక్కలేదా

ఏదైనా చిన్న ఘటన జరిగినా ఆమూలాగ్రం శోధనచేసి సమగ్ర వివరాలను సేకరించడంలో పోలీసు నిఘా విభాగం కీలకంగా పని చేస్తుంది. అలాంటి నిఘా విభాగం నకిలీమద్యం తయారీ కార్మాగారమే నడుస్తుంటే తెలియకలేదా అన్నది ఆశ్చర్యమే. ఏదిఏమైనా నకిలీమద్యం తయారీ కేంద్రం వెలుగులోకి రావడం ములకలచెరువులో కలకలం రేపింది. తాము నిత్యం సంచరించే ప్రాంతంలోనే ఇలాంటి పని జరుగుతోందా అంటూ ఆశ్చర్యం, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బెజవాడకు లింకు

ములకలచెరువు నకిలీమద్యం తయారీ వ్యవహారంలో విజయవాడకు చెందిన వ్యక్తులతో లింకులున్నట్టు అనుమానిస్తున్నారు. వీరికి స్థానిక టీడీపీనేతలతో పరిచయాలు ఉన్నట్టు, వారికి ఇందులో ప్రమేయం ఉందన్న ప్రచారం సాగుతోంది. విజయవాడకు చెందిన జనార్దనరావు ద్వారానే ఇక్కడ పనిచేస్తున్న కూలీలను పంపినట్టు ఎక్సైజ్ అధికారులే ప్రకటించారు. నకిలీ మద్యం తయారీకి వినియోగిస్తున్న యంత్రాలు ఎక్కడినుంచి తెప్పించారు, నకిలీ లేబుళ్లు ఎక్కడ ముద్రించారో,ఎవరు ముద్రింపజేశారో తేలాల్సి ఉంది.

ఎప్పటినుంచి సాగుతోంది



కేరళమాల్ట్ బాటిల్‌లో నింపిన నకిలీమద్యం

నకిలీమద్యం తయారీ కేంద్రం ఎప్పటినుంచి నడుస్తోందనే దానిపై స్పష్టత లేకపోతోంది. టీడీపీ అధికారంలోకి వచ్చాక.. మద్యం దుకాణాల నిర్వహణ మొదలైన తర్వాత నుంచి మొదలై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అయితే నకిలీ మద్యం కర్మాగారం నడుస్తున్న భవన యజమాని లక్ష్మీనారాయణ బెంగళూరులో ఉంటారని, ఆయన రామ్మోహన్ అనే వ్యక్తికి లీజుకు ఇచ్చాడని ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. ఇతను కొన్నినెలల క్రితం దాబా నిర్వహణ నిలిపివేశాడని, తర్వాత ఈ భవనాన్ని ఎవరు లీజుకు పొందారో తెలియాల్సి ఉందని ఎక్సైజ్ అధికారులు ప్రకటించారు. అంటే ఈ దాబా ఖాళీ అయినప్పటినుంచి నకిలీమద్యం తయారీ మొదలై ఉంటుందన్న కోణంలో విచారణ మొదలైంది.



బెంగళూరు బ్రాందీ నకిలీ లేబుల్

కిలోమీటరు దూరంలోనే..
ఎక్సైజ్, పోలీసు సర్కిల్ స్టేషన్లకు కిలోమీటర్ దూరంలోనే నకిలీమద్యం తయారీ కార్మాగారం నిర్వహిస్తుంటే ఎక్సైజ్, పోలీసులకు ఆ విషయం తెలియకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కడప, రాయచోటి నుంచి ఎక్సైజ్ అధికారులు వచ్చి దాడి చేసేదాకా ఇక్కడి వ్యవహారం ఎవరికీ తెలియదంటే ఎవరికైనా అనుమానం కలగకమానదు. పోలీసు పెట్రోలింగ్, తనిఖీలు సాధారణంగానే జరుగుతుంటాయి. అక్రమ మద్యం, కర్ణాటక మద్యం, సారా తయారీపై ఎక్సైజ్‌శాఖ దాడులు నిరంతరం సాగుతుంటాయి. ఎక్కడో అటవీ ప్రాంతాల్లో నాటుసారా తయారీపై దాడులుచేసే ఎక్సైజ్ పోలీసులకు తమ స్టేషన్‌కు కిలో మీటర్ దూరంలో నకిలీ మద్యం తయారీ కర్మాగారం కొనసాగుతుంటే ఎందుకు తెలియకుండాపోయిందో ఆశాఖ ఉన్నతాధికారులే తేల్చాలి. లేదంటే శాఖపరమైన దర్యాప్తు చేపట్టాలి.

దసరా మరుసటిరోజే



యంత్రానికి వేసిన పూలహారం

నకిలీమద్యంతో వ్యాపారం వర్ధిల్లాలని ఆశించారేమో..యంత్రాలకు, క్యాన్లకు పూజ నిర్వహించారు. గురువారం విజయదశమిరోజు ఈ వేడుక నిర్వహించినట్టు తెలుస్తోంది. గ్యాస్ నింపే యంత్రాలకు పూజలు చేసి వాటికి పూలహారాలు వేయడం దాడుల్లో కనిపించింది. దీని చూసిన అధికారులు ఔరా అంటూ ఆశ్చర్యపోయారు.

పల్లెపల్లెకు ఈ మద్యమే
ములకలచెరువులో తయారైన నకిలీమద్యం తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో బెల్టుషాపులకు తరలించి విక్రయించినట్టు ఎక్సైజ్ అధికారులే చెబుతున్నారు. బెల్టుషాపులకు ఆయా మద్యం దుకాణాదారులే వారి పరిధిలోని పల్లెలకు సరఫరా చేస్తారు. అధికార పార్టీనేతల అండతో ఉమ్మడి చిత్తూరు, అనంతపురంజిల్లాలకు సరఫరా చేసినట్టు అనుమానిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు ప్రకటించినట్టు పాలవ్యాన్‌లో నకిలీమద్యాన్ని బెల్టుషాపులకు తరలించి విక్రయిస్తున్నట్టు చెప్పారు. దీంతో పేదలు, కార్మిక, కర్షకులు ఈ నకిలీ మద్యం సేవించి ఆరోగ్యాన్ని గుల్ల చేసుకున్నారు.

గాంధీజీ మార్గంలో నడవాలి

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట టౌన్: జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం మాజీ సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని గాంధీ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ గాంధీజీ ఆశయమైన అహింస, శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని కోరారు. మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గాంధీ చూపిన బాటలో పయనించి ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి గాంధీజీ కలలుగన్న గ్రామస్వరా జ్యం దిశగా తన హయాంలో బాటలు వేశారన్నారు.మహాత్ముని ఆశయాలకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని ఆరోపించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనిస్‌రెడ్డి, వైఎస్సార్ సిపి వివిధ విభాగాల కన్వీనర్లు వడ్డే రమణ, ఏల్చూరు అశోక్‌కుమార్, సనిశెట్టి నవీన్‌కుమార్, బొగ్గరపు రాజేష్‌గుప్త, పచ్చిపులుసు చక్రి, మిర్యాల సురేఖ, దయానంద్, కటారు శేఖర్‌రెడ్డి, గోవిందు బాలకృష్ణ, దండు గోపి, దాసరి పెంచలయ్య, సురేంద్రయాదవ్, జాహీద్‌అలీ, అబ్దుల్ మునాఫ్, అమర, వేల్పుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తదితరులు

తగ్గిన ధరలకే వస్తువులు విక్రయించాలి

జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

గుర్రంకొండ: జీఎస్టీతో తగ్గిన ధరల మేరకే అన్ని రకాల వస్తువులను విక్రయించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సూపర్ జీఎస్టీ– సూపర్‌సేవింగ్స్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన వివిధ రకాల ప్రదర్శనశాలలను సందర్శించి, సూపర్ జీఎస్టీ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుకాణాల వద్ద గతంలో ఉన్న ఎమ్మార్పీ ధరలు, ప్రస్తుతం జీఎస్టీతో తగ్గిన ధరల వివరాలను ప్రజలకు తెలియజేస్తూ సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎవరైనా అధిక ధరలకు, పాత ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యాపారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయట్రాక్టర్లు, వ్యవసాయయంత్రాలపైన 12 నుంచి 5 శాతం మేరకు ధరలు తగ్గాయన్నారు. ట్రాక్టర్ విడి భాగాలు, టైర్లు, ట్రోన్లపైన 18 నుంచి 5 శాతం మేరకు జీఎస్టీతో తగ్గాయన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తగ్గించిన ధరల మేరకు వ్యాపారులు విక్రయించకపోతే ప్రజలు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు చేయాలంటే జిల్లా స్థాయిలో టోల్‌ఫ్రీ నంబర్లు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ, జిల్లా ఉద్యానశాఖాధికారిణి సుభాషిణి, జిల్లా పీడీ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి, ఏవో రత్నమ్మ, సింగిల్‌విండో చైర్మన్ మూర్తిరావ్, నాయకులు నాయిని జగదీష్, ఎల్లుట్ల మురళీ, సుంకర్ శేఖర్, నౌషాద్, మహాత్మారెడ్డి, చలమారెడ్డిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

వ్యాపారులపై కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు

జాక్‌పాట్‌ల పేరుతో టమాటా రైతులను వ్యాపారులు ఇష్టానుసారంగా దోచుకొంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు రైతులు, టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్‌ను వారు కలిశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ జాక్‌పాట్‌ల పేరుతో వ్యాపారులు వందకు 12 నుంచి 15 క్రేట్లు టమాటాలను బలవంతంగా తీసుకొంటున్నారని అన్నారు. మండీల్లో వేలం పాటలు నిర్వహించే సమయంలో టమాటాలను క్రేట్‌లపై రాసులుగా పోస్తున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే వ్యాపారులు దౌర్జన్యానికి దిగుతున్నారని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కమీషన్లు నాలుగుశాతానికి బదులు పదిశాతం తీసుకొంటున్నారని ఫిర్యాదు చేశారు.సమస్యలపై ఎన్ని మార్లు ఫిర్యాదు చేసినా మార్కెట్‌యార్డులో పట్టించుకొనే వారు కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు.

ముగిసిన దసరా సంబరాలు



ప్రొద్దుటూరు: తొట్టి మెరవణిలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి



రాయచోటిటౌన్: శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవి శోభాయాత్ర



కడపలో గ్రామోత్సవంలో శ్రీ విజయదుర్గమ్మ



మదనపల్లెసిటీ: ధనలక్ష్మి అలంకారంలో వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి

ప్రొద్దుటూరు కల్చరల్: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. విజయదశమిని పురస్కరించుకుని గురువారం విశేష అలంకారాలలో ఉన్న అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో గురువారం సాయంత్రం శమీదర్శన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విజయానికి, సకలశుభాలకు, సిరిసంపదలకు చిహ్నమైన శమీ వృక్షాన్ని విజయదశమి రోజు దర్శించి పూజలు నిర్వహిస్తే శుభప్రదమని దశమినాడు ఈ మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వాసవీమాత అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలతో, పూలతో, పుత్తడి ఆభరణాలతో అలంకరించి ఊరేగింపుగా తీసుకువచ్చి కొత్రపాడురోడ్డులోని శ్రీ వాసవీ శమీవృక్ష మండపంలో శమీదర్శన మహోత్సవం చేయించారు.

కన్నులపండువగా వాసవాంబ తొట్టిమెరవణి

శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో దేవీశరన్నవరాత్రి వేడుకల సందర్భంగా గురువారం అర్ధరాత్రి విజయలక్ష్మీదేవి రూపంలో అమ్మవారు గ్రామోత్సవం (తొట్టిమెరవణి) కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని గజమాలలతో, ఆభరణాలతో అలంకరించి శ్రీచక్రం ఉన్న పంచలోహ హంస వాహన రథంపై ఆశీనులను చేసి పురవీధులలో వాసవీ నామస్మరణ మధ్య అట్టహాసంగా ఊరేగించారు. అమ్మవారిశాల నుంచి రాత్రి 11.55 గంటల సమయంలో ప్రారంభమైన తొట్టిమెరవణి బంగారు అంగళ్లవీధి, పప్పుల బజార్ మీదుగా 2.50 గంటల సమయంలో పుట్టపర్తి సర్కిల్‌కు చేరుకుంది. అనంతరం నుంచి శివాలయం ఎదురుగా మార్కెట్‌లో రకరకాల బాణసంచా పేలుళ్లు, చెట్లు, పాములు వంటి వాటిని పేల్చి విజయదశమి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. కాంతార ప్రదర్శన, కేరళ సింగారి మేళం, అమ్మవారి తొట్టిమెరవణిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



ప్రొద్దుటూరు: పుట్టపర్తి సర్కిల్‌లో భక్తుల సందడి

- అన్నమయ్య జిల్లాలో దసరా వేడుకలు అంబరాన్నంటాయి. భక్తులతో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. యువతీ,యువకులు జమ్మిచెట్టుకు పూజలు చేసి ,జమ్మి ఆకు పెద్దలకు అందించి ఆశీర్వాదం తీసుకున్నారు.రాయచోటిలో శ్రీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం జరిగిన శమీదర్శన శోభాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మదనపల్లె వాసవీభవన్‌వీధిలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరదేవి ధనలక్ష్మి అలంకారంలో అందరినీ ఆకట్టుకుంది. సుమారు రూ.80 లక్షల వరకు కరెన్సీనోట్లతో అమ్మవారి అలంకరించారు.

నియామకం

సాక్షి రాయచోటి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన పలువురు నాయకులను సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ), స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) మెంబర్స్‌గా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) మెంబర్లు:



దేశాయి తిప్పారెడ్డి



సుగవాసి బాలసుబ్రమణ్యం



డాక్టర్ కె.ఇక్బాల్ అహ్మద్‌ఖాన్

దేశాయి తిప్పారెడ్డి (మదనపల్లె), సుగవాసి బాలసుబ్రమణ్యం (రాయచోటి), డాక్టర్ కె. ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ (పీలేరు)

స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ)మెంబర్లు:



షమీమ్ అస్లం



పి.శ్రీనివాసులురెడ్డి



నల్లారి తిమ్మారెడ్డి



గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి



యోగేశ్వరరెడ్డి

గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి (రాజంపేట), నల్లారి తిమ్మారెడ్డి (పీలేరు), పూల శ్రీనివాస రెడ్డి (రాజంపేట), షమీమ్ అస్లం (మదనపల్లె), యోగేశ్వరరెడ్డి (రాజంపేట)

క్లుప్తంగా

అంబులెన్స్ ఢీకొని ఆర్‌ఎంపీ మృతి


నరేంద్రరావు (ఫైల్)

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో నివాసముంటున్న ప్రముఖ ఆర్‌ఎంపీ నార్జాల నరేంద్రరావు శనివారం తెల్లవారుజామున పట్టణలోని గంగాలమ్మ ఆలయం వద్ద రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న అంబులెన్స్ ఢీకొని మృతి చెందాడు. కేసున మోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. పలువురు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

మూడు వాహనాలను ఢీకొట్టిన లారీ
– తప్పిన పెను ప్రమాదం


పీలేరు సమీపంలో ఆటో, లారీని ఢీకొన్న లారీ

పీలేరు రూరల్ : వేగంగా వస్తున్న లారీ వరుసగా మూడు వాహనాలను ఢీకొట్టి.. బీభత్సం సృష్టించింది. అయితే అదృష్టవశాత్తు పెను ప్రమాదం తప్పింది. చిత్తూరు వైపు నుంచి ఎర్రగుంట్లకు వెళుతున్న లారీ.. కర్నూలుకు చెందిన దంపతులు ఎం.యతేంద్ర వర్మ, పి.అరుణదావి కారులో చిత్తూరుకు వస్తుండగా ఢీకొట్టింది. అనంతరం అదే లారీ మరో లారీ, ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎం.యతేంద్ర వర్మ, పి.అరుణదావి గాయపడ్డారు. వారిని స్థానికులు పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవరు, మరో లారీ డ్రైవరు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఒకే సారి నాలుగు వాహనాలు ఢీకొనడంతో ట్రాఫిక్ స్తంభించింది.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య


మృతి చెందిన నరసింహులు

మదనపల్లె రూరల్ : అనారోగ్యం, మతిమరుపుతో బాధపడుతున్న తనను భార్య అకారణంగా తిడుతోందనే కోపంతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మదనపల్లె మండలంలో జరిగింది. కొత్త ఇండ్లు పంచాయతీ రంగారెడ్డి కాలనీకి చెందిన బండ్ల నరసింహులు(69) కొంత కాలంగా షుగర్, మతిమరుపు వ్యాధితో బాధపడుతున్నాడు. సమయానికి మాత్రలు వేసుకోకపోవడం, వ్యాధిని ముదరబెట్టుకుంటుండటంతో భార్య గంగులమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన నరసింహులు, అలిగి, బుధవారం సాయంత్రం కొత్త ఇంటి సమీపంలోని బహిరంగ ప్రదేశానికి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్మకు ప్రయత్నించాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన అతడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సలు పొందుతూ నరసింహులు గురువారం మృతి చెందాడు. తాలూకా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘర్షణ.. బైక్ దగ్ధం

పుల్లంపేట : మండల పరిధిలోని తిప్పాయపల్లి గ్రామంలో ఇరువురు ఘర్షణ పడ్డ ఘటనలో బైక్ దగ్ధమైనట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన అంజిరెడ్డి అనే వ్యక్తి గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని అనడంతో.. జగన్మోహన్‌రెడ్డి దాడి చేసి బైక్ దగ్ధం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఒంటిమిట్టలో వైభవంగా శమీవృక్ష పూజ


ఒంటిమిట్టలో స్వామి, అమ్మవారి గ్రామోత్సవం


జమ్మి చెట్టుకు పూజ చేస్తున్న వేద పండితులు

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామికి గురువారం విజయదశమి సందర్భంగా ఆలయ అర్చకులచే టీటీడీ అధికారులు వైభవంగా శమీ వృక్ష పూజ నిర్వహించారు. ముందుగా ఆలయంలోని సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులను బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలు, పుష్పమాలలతో సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవారిని రామాలయం నుంచి ఊరేగింపుగా తీసుకొని వచ్చి, శృంగిశైలిపై ఉన్న ఆస్థాన మండపంలో ఆశీనులను చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు ఆరాధన, చతుర్వేద పారాయణం, శమీ వృక్ష పూజ, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం సీతారామలక్ష్మణ మూర్తులు గ్రామోత్సవానికి బయలుదేరి, పురవీధుల్లో భక్తులకు


న్యాయమూర్తి పి.టి ఆశాకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

అభయమిచ్చారు. తమ ఇంటి వద్దకు వచ్చిన శ్రీరాముడికి భక్తులు కాయాకర్పూరం సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, ఆలయ విజిలెన్స్ అధికారి గంగులయ్య, ఆలయ అర్చకులు వీణారాఘవాచార్యులు, శ్రావణ్ కుమార్, పవన్ కుమార్, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయాన్ని తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి పి.టి ఆశా శుక్రవారం దర్శించుకున్నారు. ముందుగా ఆమెకు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షిణ కావించి, గర్భాలయంలోని మూల విరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె కాసేపు ఆలయ రంగమండపంలో సేద తీరారు. ఆమెను అర్చకులు ఆలయ మర్యాదలతో సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఏపీఎండీసీ పాఠశాల ఉద్యోగి మృతి


మృతి చెందిన రవితేజ

ఓబులవారిపల్లె : 'ఏమి జరిగిందో ఏమో తెలియదు' కానీ.. ఏపీఎండీసీ పాఠశాల ఉద్యోగి పసుపులేటి రవితేజ(26) శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీఎండీసీ పాఠశాల ప్రారంభం నుంచి పసుపులేటి రవితేజ అక్కడ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. సెక్యూరిటీ ఉద్యోగంతోపాటు పాఠశాలలో టీలు అందించడం, ఇతర పనులు కూడా చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఏపీఎండీసీ పాఠశాల రక్షణగోడ పక్కనే ఉన్న తాగునీటి మోటారు వేసేందుకు వెళ్లి ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతి చెందాడు. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. పాఠశాల పై అంతస్తులో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయులు గమనించి ప్రధానోపాధ్యాయురాలికి సమాచారం ఇచ్చారు. అందరూ అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే రవితేజ మృతి చెంది ఉన్నాడు. హుటాహుటిన రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏపీఎండీసీ పాఠశాలలో పని ఒత్తిడి కారణంగా రవితేజ మృతి చెందాడని బంధువులు ఆరోపిస్తున్నారు. సెక్యూరిటీ పనులతోపాటు ఇతర పనులు కూడా చేయించుకుంటూ ఉండటంతో రవితేజ ఇబ్బందులు పడేవాడని వారు తెలిపారు. పని ఒత్తిడితో గుండెపోటుతో చనిపోయాడా, విద్యుత్ షాక్‌తో మృతి చెందాడా అనే విషయం తెలియాల్సి ఉంది. రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మహేష్ నాయుడు.. సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేశారు. మృతికి సంబంధించిన కారణం తెలియలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : మంగంపేట ఏపీఎండీసీ హైస్కూల్‌లో వాచ్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తూ ఆకస్మాత్తుగా మృతి చెందిన పసుపులేటి రవితేజ (29) కుటుంబాన్ని ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కూటమి ప్రభుత్వాన్ని, ఏపీఎండీసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎటువంటి భరోసా ఇవ్వలేదని తెలిపారు. మృతుడి మరణానికి గల కారణాలు స్పష్టంగా చెప్పకపోవడంతో అనుమానాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే, నాయకులు మృతుడి కుటుంబాన్ని కలిసినా ఏమాత్రం హామీ ఇవ్వకపోవడం దారుణమని తెలిపారు. గత ప్రభుత్వంలో ఇలా జరిగితే గంటల్లో 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించామని కానీ కూటమి నాయకులకు చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం ఇవ్వకుంటే నిరసనలు చేస్తామని హెచ్చరించారు.

సిద్దవటం కోటలో అడవి పందుల స్వైరవిహారం

సిద్దవటం : మండల కేంద్రంలోని మట్లి రాజుల కోటలో అడవిపందులు రాత్రి వేళలో స్వైరవిహారం చేస్తున్నాయి. సిద్దవటం కోట రాను రాను మట్టిలో కలుస్తుందనడానికి ఇదొక ఉదాహరణగా చెప్పవచ్చు. డంకానగర్, పార్కులు, బిస్మిల్లా షా ఖాద్రి దర్గా సమీపంలోని రహదారి పక్కన అడవి పందులు పెద్ద గుంతలు చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. కోటలోని కట్టడాలు కూడా పడిపోతున్నా పురవాస్తు శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదు. సిబ్బంది కేవలం నోటుబుక్కులలో పర్యాటకుల పేర్లు నమోదు చేసుకుని వెళ్లిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.


సిద్దవటం కోటలో అడవి పందులు గుంతలు చేసిన దృశ్యం

ఐచర్ ఢీకొని మహిళ మృతి


మృతి చెందిన మునిలక్ష్మమ్మ

మదనపల్లె రూరల్ : బతుకుదెరువు కోసం వచ్చిన మహిళ రోడ్డు దాటే క్రమంలో ఐచర్ వాహనం ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందిన ఘటన గురువారం రాత్రి మండలంలోని వలసపల్లె పంచాయతీలో జరిగింది. పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె మండలం లద్దిగంకు చెందిన మునిలక్ష్మమ్మ(55) జీవనోపాధిలో భాగంగా వలసపల్లె పంచాయతీ గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో హెల్పర్‌గా పనికి కుదిరింది. శుక్రవారం నుంచి గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ కార్యక్రమాలు ఉండటంతో, స్వగ్రామం నుంచి గురువారం సాయంత్రం బయలుదేరింది. పుంగనూరు నుంచి ఆటోలో మరో మహిళతో కలిసి బయలుదేరిన మునిలక్ష్మమ్మ, గ్రీన్‌వ్యాలీ స్కూల్ ఎదురుగా రోడ్డుకు అవతలి వైపున దిగింది. తోడు వచ్చిన మహిళ ఆటో డ్రైవర్‌కు డబ్బులు ఇస్తుండగా, మునిలక్ష్మమ్మ రోడ్డు దాటేందుకు ప్రయత్నించింది. ఈక్రమంలో హైవేపై వేగంగా వస్తున్న ఐచర్ వాహనం మునిలక్ష్మమ్మను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కుమార్తె రెడ్డెమ్మ ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బస్సు, బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

సుండుపల్లె : మండల పరిధిలోని మడితాడు వంక వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రాయవరం నుండి రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో మడితాడు గ్రామం చంద్రాజుగారిపల్లికి చెందిన ద్విచక్ర వాహనదారుడు సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న స్థానికులు గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించగా, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

'శ్రీశక్తి' విజయంలో ఆర్టీసీ కార్మికుల పాత్ర కీలకం


ఏడీఈ చంగల్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న డిపో అధికారులు

రాయచోటి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రీశక్తి పథకాన్ని దిగ్విజయం చేయడంలో ఆర్టీసీ కార్మికుల పాత్రం చాలా గొప్పదని విజయవాడ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఇంజనీర్ టి.చంగల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన రాయచోటి డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రవాణ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న రాయచోటి డిపోను అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మహేశ్వరరెడ్డి, డిపో యంఎఫ్, గ్యారేజీ కార్మికులు పాల్గొన్నారు.

కుమార్తె పెళ్లి ఆగిపోతుందని..
తండ్రి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న మునెప్ప

ములకలచెరువు : కూతురి పెళ్లికి అన్నీ సిద్ధం చేసుకున్న తండ్రికి ఓ చేదు నిజం తెలిసింది. దీంతో పీట లెక్కబోతున్న కన్నబిడ్డ పెళ్లి ఆగిపోతుందన్న ఆవేదనతో ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన శుక్రవారం మండలంలో జరిగింది. కుటుంబీకులు, స్థానికుల కథనం మేరకు వివరాలు. మద్దినాయునిపల్లె పంచాయతీ వడ్డిపల్లికి చెందిన మునెప్ప (58) కుమార్తె పెళ్లి ఓ వ్యక్తితో నిశ్చయమైంది. ఈ శని, ఆదివారాల్లో వివాహ వేడుక జరగాలి. అయితే పిడుగులాంటి వార్త చెవిన పడింది. పెళ్లి కుమారుడికి ఇప్పటికే పెళ్లయి, పిల్లలు ఉన్నట్టు తెలిసింది. దీంతో అలాంటి వ్యక్తితో బిడ్డపెళ్లి చేసేదేలా అని కుమిలిపోయాడు. పెళ్లి చేయడం ఇష్టం లేని తండ్రి మునెప్ప మనస్తాపానికి గురై పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలించారు. కాగా పెళ్లి కోసం ఇప్పటికే ఖర్చు కూడా చేయడంతో ఆ కుటుంబంలో ఆవేదన నెలకొంది.

సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం

కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు


ఆత్మహత్య చేసుకునేందుకు కారణాలు పోలీసులకు తెలుపుతున్న రెడ్డిశేఖర్‌నాయుడు

మదనపల్లె రూరల్ : భార్య తన మాట వినకపోవడం, కుటుంబ సమస్యలతో మనస్తాపం చెందిన భర్త సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నిస్తుండగా.. గుర్తించిన పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన శుక్రవారం మదనపల్లెలో జరిగింది. కలకడ మండలం ఎనుగొండపాలెం మొరమ్మీదపల్లెకు చెందిన నామాల రెడ్డిశేఖర్‌నాయుడు, మౌని భార్యాభర్తలు. బతుకుదెరువులో భాగంగా మదనపల్లెకు వలస వచ్చి చెంబకూరురోడ్డు రాగిమానుసర్కిల్ సమీపంలో కాపురం ఉంటున్నారు. హోటల్‌లో వంట పనులు చేస్తూ జీవిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం రెడ్డిశేఖర్‌నాయుడు కర్ణాటక రాష్ట్రం చింతామణిలో పనిచేసేందుకు వెళ్లాడు. దీంతో భార్య మౌని, భర్తకు చెప్పకుండా మదనపల్లెలో ఇల్లు ఖాళీ చేసి, స్వగ్రామానికి వెళ్లిపోయింది. రెండు రోజుల క్రితం మదనపల్లెకు వచ్చి గతంలో పని చేసిన హోటల్‌లో పనికి కుదిరింది. తనకు చెప్పకుండా ఇల్లు ఖాళీ చేయడం, పల్లెలో ఉండకుండా మళ్లీ టౌన్‌కు రావడం, ఎందుకు వచ్చావని నిలదీస్తే... తనపైనే తిరగబడటంతో అవమానం భరించలేక సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నాడు. పట్టణంలోని కదిరిరోడ్డు బ్రహ్మంగారి గుడి వద్ద సెల్‌టవర్ వద్దకు వచ్చి ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా, స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రెడ్డిశేఖర్‌నాయుడును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జీఎస్‌టీ తగ్గింపు ప్రతి రైతుకు తెలియాలి


వ్యవసాయ పరికరాల ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

రాజంపేట రూరల్ : వ్యవసాయం చేసే ప్రతి రైతుకు జీఎస్‌టీ తగ్గింపుదల గురించి తెలియజేయాలని వ్యవసాయ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశించారు. మండల పరిధిలోని ఊటుకూరులో శుక్రవారం జీఎస్టీ 2.0 సూపర్ జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా ఏడీఏ కే.శివశంకర్ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌లు, వ్యవసాయ పరికరాల ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా ట్రాక్టర్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ సబ్ కలెక్టర్ హెచ్.ఎస్ భావనతో కలిసి నూతన జీఎస్‌టీ ధరతో కొనుగోలు చేసిన ట్రాక్టర్‌లను ప్రారంభించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ జీఎస్‌టీతో వ్యవసాయ కార్యకలాపాల ఖర్చు గణనీయంగా తగ్గుతుందన్నారు. డ్రిప్, స్ప్రింకర్‌లపై 5 శాతం తగ్గిందన్నారు. రూ.6 లక్షల ట్రాక్టర్‌పై రూ.42 వేలు తగ్గుతుందన్నారు. అదే విధంగా ట్రాక్టర్ విడిభాగాలైన టైర్‌లు, హైడ్రాలిక్ పంపులు వంటి వాటిపై కూడా తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ పీర్‌మున్నీ, ఎంపీడీఓ వరప్రసాద్, జీఎస్‌టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ పీ.మధుసూదన్‌రెడ్డి, ఏఓ జీ నాగలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్, హెచ్ఓ సునీల్, బీటీఎం సుబ్రమణ్యం, వీఏఏలు ప్రియాంక, వంశీకృష్ణ, వీహెచ్ఏ మల్లిక, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను
సంస్థలో విలీనం చేయాలి

రాయచోటి జగదాంబసెంటర్ : విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. రాయచోటి పట్టణంలో శుక్రవారం వారు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 5వ తేదీన విజయవాడ బాలోత్సవ భవన్ 2వ అంతస్తులో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. విద్యుత్‌రంగాన్ని ప్రైవేటీకరణలో భాగంగా కాంట్రాక్టు కార్మికులు వ్యవస్థను తీసుకొచ్చి ఇప్పటికి 27 వేల మందికి పైగా కార్మికుల్ని రెగ్యులర్ చేయకుండా ఉద్యోగికి ఇచ్చే జీతంలో 5వ వంతు ఇస్తూ వారి శ్రమని, హక్కులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా పోరాడుతున్నా విద్యుత్ యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు కార్మికుల్ని సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు కూడా వారికి రావాల్సిన డీఏలు ఇవ్వలేదని, పాత పెన్షన్ ఇవ్వాలని, జేఎల్ఎం గ్రేడ్-2 లకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్‌ను వర్తింప చేసి వారికి న్యాయం చేయాలని, చాలా కాలం తరువాత విద్యుత్ సంస్థలో అన్ని సంఘాలు ఆందోళనా కార్యక్రమాలు ప్రారంభించారని తెలిపారు. ఈ పోరాట కార్యక్రమాలను బలోపేతం చేయడానికి అన్ని విద్యుత్ సంఘాలు, కార్మిక సంఘాలతో జరిగే ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఏపీ రమణ, ఖాదర్‌బాషా, రెడ్డప్పనాయుడు, సుబ్రమణ్యంరాజు, శ్రీనివాసులురెడ్డి, నాగేష్‌గౌడ్, బాలకృష్ణ, హేమ, నారాయణ, స్ట్రగుల్ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ జయంతి రోజున జోరుగా మద్యం విక్రయాలు


వైన్‌షాపు వద్ద మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న దృశ్యం

గుర్రంకొండ : గాంధీ జయంతి అక్టోబర్ రెండో తేదీన మద్యం విక్రయాలు గుర్రంకొండలో జోరుగా జరగడం గమనార్హం. గురువారం నాడు గాంధీ జయంతిని పురస్కరించుకొని ఎక్సైజ్‌శాఖ అధికారులు మండలంలోని మూడు వైన్‌షాపులను సీజ్ చేసి వెళ్లిపోయారు. అయితే వైన్‌షాపు నిర్వాహకులు ముందుగా వేసుకొన్న ప్రణాళికల ప్రకారం మద్యం దుకాణాల పరిసరాలు, వెనుకవైపు బాటిళ్లు ఉంచుకొని యథేచ్ఛగా విక్రయాలు నిర్వహించారు. పలువురు గాంధీ జయంతి రోజునే బస్టాండులో తాగి రోడ్లపైనే పడిపోయి ఉండడం గమనార్హం. గాంధీ జయంతి రోజున ఇలా మద్యం విక్రయించడం దారుణమని గ్రామస్తులు చర్చించుకొంటున్నారు. ఈ విషయమై వాల్మీకిపురం ఎక్సైజ్ సీఐ లతను వివరణ కోరగా జరిగిన సంఘటనపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొంటామన్నారు.

దెబ్బతిన్న లోలెవల్ కాజ్‌వే వంతెన

సిద్దవటం : సిద్దవటంలోని పెన్నా నదిపై నిర్మించిన లోలెవల్ వంతెన గత కొంత కాలంగా ప్రవహిస్తున్న వరద నీటి కారణంగా దెబ్బతింది. ఆగస్టు నుంచి ఇటు కుందూ నదినీరు, వర్షాల కారణంగా వచ్చిన వరదనీటితో.. దాదాపు 2 నెలల నుంచి పెన్నానది లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. పెన్నానది లోలెవల్ వంతెనపై నుంచి సిద్దవటం గ్రామానికి రూ.4 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో స్కీం వాటర్ పైపులైన్ ఏర్పాటు చేశారు. నీటి ప్రవాహానికి గురువారం ఒక్కసారిగా పెన్నానదిపై ఉన్న లోలెవల్ కాజ్‌వే కుంగిపోయింది. వంతెనపై ఏర్పాటు చేసిన వాటర్ పైప్‌లైన్ కూడా దెబ్బతినే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెన్నానది లోలెవల్ వంతెనకు మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


పెన్నానదిపై నిర్మించిన లోలెవల్ వంతెన దెబ్బతిన్న దృశ్యం

• నూతన వధూవరులకు ఆశీర్వాదం



పులివెందులలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతీరెడ్డి శుక్రవారం పలు శుభ కార్యాల్లో పాల్గొన్నారు. గత నెల 29వ తేదీన 21వ వార్డు కౌన్సిలర్ సోకే వెంకటరమణ (కోడిరమణ) కుమారుడు వంశీ వివాహం శశికళతో జరిగింది. శుక్రవారం వైఎస్ భారతమ్మ తన సోదరుడు డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వైఎస్ ప్రమీలమ్మతో కలిసి కోడి రమణ నివాసానికి చేరుకుని నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.



పులివెందుల వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగాపురం మధుసూదన్‌రెడ్డి కుమార్తె వాణి వివాహం చరణ్‌కుమార్‌రెడ్డితో కదిరి రోడ్డులోని ఎస్సీఎస్ఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగింది. ఈ వేడుకకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతీరెడ్డి, డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ ప్రమీలమ్మ, వైఎస్ మధుసూదన్‌రెడ్డిలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.